అభివృద్ధి పనుల పరిశీలన

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌పురి కాలనీలో రూ.80 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీవరేజ్, స్టామ్‌వాటర్, డ్రైయిన్ పైపులైన్ పనులు పూర్తయిన ప్రాంతాల్లో ప్రణాళిక బద్ధంగా సీసీరోడ్లు వేయిస్తున్నామన్నారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ నేతలు కొండల్‌రెడ్డి, జగన్, బాలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి భారీ కటౌట్

కుషాయిగూడ: అయోధ్య శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో చర్లపల్లి డివిజన్, చక్రిపురం చౌరస్తాలోని శ్రీరాంబేకరి అధినేత విజయ్‌కుమార్‌రెడ్డి తన బేకరీ ఎదుట 16 ఫీట్ల శ్రీరాముడి భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా తన వంతుగా ఏమైన చేయాలనే సంకల్పంతోనే ఈ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేసినట్లు విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆయిల్, గ్యాస్ కొరత రాకుండా చూడాలి



ఉప్పల్: అక్రమంగా ట్యాంకర్ల నుంచి ఆయిల్‌ను తీయడం లాంటి కార్యకలాపాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని మల్కాజిగిరి డీసీపీ పద్మజా హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పెట్రోల్ సంస్థల ప్రతినిధులు మల్కాజిగిరి జోన్ పోలీసులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. మున్ముందు ఎలాంటి ఆయిల్, గ్యాస్‌కొరత రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికనుగుణంగా డ్రైవర్లు, కార్మికులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ట్యాంకర్ల నుంచి పెట్రోల్, డీజిల్‌ను దొంగిలించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అదనపు డీసీపీ వెంకటరమణ, మల్కాజిగిరి ఏసీపీ చంద్రశేఖర్, కుశాయిగూడ ఏసీపీ రవీందర్, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలి

అల్వాల్: అయోధ్య శ్రీరామ ఆలయ విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత శ్రీరామ భక్తులదేనని అల్వాల్ సీఐ రాహుల్‌దేవ్ అన్నారు. శనివారం అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో రామభక్తులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బరీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీఐ. ప్రమోద్‌కుమార్, ఎస్సై సురేష్, స్థానిక భక్త సమాజం తదితరులున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన కూచిపూడి నృత్యం పలువురిని ఆకట్టుకుంది. అంకమం శ్రీరీషా శిష్యబృందం అద్భుతంగా ప్రదర్శించారు. వారిని పలువురు అభినందించారు.

ఉప్పల్ సీఐగా ఎలక్షన్‌రెడ్డి..



రామంతాపూర్ : ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఆఫీసర్ (సీఐ)గా ఎలక్షన్‌రెడ్డిని రాచకొండ పోలీస్ కమిషనర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎలక్షన్‌రెడ్డి శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు.

బీజేపీ పార్లమెంట్ సమావేశానికి కార్పొరేటర్ సునీత



మౌలాలి: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ సన్నాహక సమావేశం శుక్రవారం హోమీజేబాబా ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఆర్మూరు ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు సాయిబాబా, ఉపాధ్యక్షులు శ్రీను, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, శివగౌడ్ తదితరులు ఉన్నారు.

అంతా రామమయం

- ఉప్పల్ సర్కిల్ పరిధిలో రామనామ జపం
- పలు ఆలయాలను శుద్ధి చేసిన ప్రజలు
- వెల్లువెత్తిన ఆధ్యాత్మికత, పరవశించిన భక్తులు



వెండి యజ్ఞోపవేతములను ఎమ్మెల్యేకు అందజేస్తున్న దృశ్యం

రామంతాపూర్ : రేపు అయోధ్యలో భవ్య రామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన సందర్భంగా ఉప్పల్ సర్కిల్‌లో వివిధ ప్రాంతాల్లో రామనామజపంతో మారుమోగిపోతూ.. అధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అయోధ్యలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది నిర్మించిన భవ్య రామ మందిర ప్రతిష్ఠాపనతో పాటు మందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం సిద్ధమవుతున్న వేళ ఉప్పల్ సర్కిల్‌లో వివిధ ప్రాంతాల్లో పలువురు పలు అధ్యాత్మిక భావనలతో కార్యక్రమాలను నిర్వహిస్తూ.. రామనామ జపంతో పలు దేవాలయాలు మారుమోగిపోతున్నాయి. ఉప్పల్‌లోని శ్రీలక్ష్మీ హయగ్రీవస్వామి ఆలయం తరఫున శ్రీరామ చంద్రస్వామి, లక్ష్మణస్వామి, ఆంజనేయ స్వాములకు వెండితో తయారు చేసిన యజ్ఞోపవీతములను అయోధ్య రామ మందిర దేవాలయానికి బహుకరించేందుకు చల్ల వీరారెడ్డి, చల్ల సుధీర్‌రెడ్డిలు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి అందజేశారు.

◆ **ఆలయాల శుభ్రత**

భవ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్. ప్రభాకర్ రామంతాపూర్‌లోని పలు దేవాలయాలల్లోని చెత్తను ఊడ్చి శుభ్రపరిచి ఆలయ గోపురాలను నీటితో కడిగి శుద్ధి చేశారు. వివిధ ప్రాంతాల్లో బాలరాముని కటౌట్లను ఆవిష్కరించారు.

◆ **పవిత్ర అక్షింతల పంపిణీ..**

ఉప్పల్ సర్కిల్‌లోని వివిధ ప్రాంతాల్లో భవ్య శ్రీరామ మందిరం అక్షింతలను విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలతో పాటు పలువురు ఇంటింటికీ వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు.



అయోధ్య రామయ్యకు అందజేయనున్న ముత్యాలహారం

◆ **అయోధ్య రామయ్యకు ముత్యాల హారం**

తార్నాకకు చెందిన ముత్యాల వ్యాపారి చిన జీయర్‌స్వామి శిష్యుడైన వెంకటదాస్ అయోధ్య రామయ్య కోసం 8 అడుగుల పొడవైన ముత్యాలహారాన్ని తయారు చేశారు. ఈ ముత్యాల హారంలో చందనం ఉపయోగించినట్లు ఆయన తెలిపారు. తొమ్మిది రోజుల పాటు దాదాపు పది మంది కలిసి హారానికి మంచి రూపం తెచ్చామని ఆయన పేర్కొన్నారు.

◆ **సోమవారం చికెన్ దుకాణాల మూసివేతకు నిర్ణయం**

అయోధ్య భవ్య రామ మందిరంలో సోమవారం బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతున్న సందర్భంగా రామంతాపూర్‌లోని చికెన్ షాపులన్నీ సోమవారం మధ్యాహ్నం వరకు మూసి ఉంచుతామని నిర్ణయించుకున్నామని, చికెన్ షాపుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వరుణ్‌యాదవ్ తెలిపారు.

◆ **ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు**

భవ్య రామాలయం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం పెద్ద వెండితెరపై ప్రత్యక్షప్రసారాన్ని రామంతాపూర్‌లోని శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి దేవాలయం ఆడిటోరియంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వెంకట్రావ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

అయోధ్య గాయత్రి హోమంలో మల్లాపూర్ వాసి..



మల్లాపూర్: అయోధ్య శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా రామభద్రచారి నిర్వహిస్తున్న యాగంలో మన తెలుగు వారైనా మల్లాపూర్‌కు చెందిన వేద పండితులు ఉప్పరపల్లి సుమన్‌శర్మ బృందం పాల్గొంటున్నారు. ప్రతిరోజు రామ గాయత్రి హోమంలో వేదపఠనం చేస్తున్నారు. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో నిర్వహించే గాయత్రి హోమంలో పాల్గొన్నడం సంతోషంగా ఉందన్నారు.

బాల రాముడికి బంగారు కడియాలు, వెండి మొలతాడు



అల్వాల్: ఈనెల 22న అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా రామాంజనేయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలరాముడికి వెండి మొలతాడు బంగారపు కాళ్ల కడియాలు అందిస్తామని ట్రస్ట్ నిర్వాహకురాలు అలివేలువాణి తెలిపారు. ఉడుతభక్తిగా తమవంతు కృషి చేస్తున్నామని స్థానిక బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం అయోధ్య బాలరాముడికి సమర్పిస్తామని తెలిపారు. వంశీ, ప్రణయ్‌కుమార్, రజిని తదితరులున్నారు.


రూ. 75 లక్షలతో వార్డు కార్యాలయం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్‌లో రూ.75 లక్షలతో నిర్మించిన వార్డు కార్యాలయం త్వరలోనే ప్రారంభించనున్నట్లు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ తెలిపారు. శనివారం వార్డు కార్యాలయాన్ని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తొందరలోనే వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. అన్ని విభాగాల అధికారులను వార్డు కార్యాలయంలో అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. డీఈ రూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, స్థానికనేతలు మల్లికార్జున్‌గౌడ్, ముత్యంరెడ్డి, రామకృష్ణ, విఠల్ యాదవ్, రాజు, నర్సింగ్‌రావు, అశోక్, బుచ్చన్నగౌడ్, స్వామి తదితరులున్నారు.

దుకాణాల్లో చోరీ.. కేసు నమోదు



మేడిపల్లి: తాళం వేసిన 9 దుకాణాల్లో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఘట్‌కేసర్ మండలం నారాపల్లి ప్రధాన రోడ్డులో శుక్రవారం రాత్రి వరుసగా ఉన్న 9 దుకాణాల్లోకి వెనుక నుంచి వచ్చి పైన ఉన్న సిమెంట్ రేకులను పగులగొట్టి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. శనివారం ఉదయం దుకాణాల యజమానులు వచ్చి దుకాణం లోపల చూడగా.. వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. 5 దుకాణాల్లో సుమారుగా రూ.15వేల నగదు చోరీ కాగా.. వరుసగా మరో 4 దుకాణాల్లో ఎలాంటి నగదు, విలువైన వస్తువులు లేకపోవడంతో ఎలాంటి వస్తువులు చోరీ కాలేదని నిర్వహకులు తెలిపారు. దుకాణాల యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేస్తున్నారు. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

తల్లితో సహా చిన్నారి అదృశ్యం



అల్వాల్: ఆసుపత్రికి వెళ్లొస్తానని చెప్పి కుమార్తెతో సహా గృహిణి అదృశ్యమైన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ వెంకటాపురం దినకర్‌నగర్‌లో నివాసముండే దేవరపాగ మల్లేష్ (33), రేఖ (27) భార్యభర్తలు. వీరికి 16 నెలల పాప ఉంది. మల్లేష్ సొంత వ్యాపారం చేస్తుండగా.. భార్య రేఖ గృహిణి. కాగా గతనెల 17న భార్యభర్తల మధ్య మాట, మాట పెరిగి చిన్న గొడవ జరిగింది. మరుసటి రోజు ఇద్దరు మాట్లాడుకున్నారు. గతనెల 27న భర్త పనిమీద బయటికి వెళ్తున్నానని భార్యకు చెప్పాడు. ఆమె కూడా తాను ఆసుపత్రికి వెళ్లొస్తానని కుమార్తె ఇవాన్షితో కలిసి వెళ్లి రాత్రి 9 గంటలైనా తిరిగి రాలేదు. భర్త అత్తమామలకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వారు కూడా రాలేదని చెప్పడంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ అభించలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చర్లపల్లి ఎస్‌హెచ్ఓగా రవీందర్



కుషాయిగూడ: చర్లపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా రవీందర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మల్లికార్జున్‌రెడ్డి సైబర్ క్రైం ఠాణాకు బదిలీపై వెళ్లగా.. కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న రవీందర్‌ను చర్లపల్లికి బదిలీ చేస్తూ రాచకొండ సీపీ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ.. చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు కృషి చేస్తానన్నారు.

మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్‌గా సత్యనారాయణ



మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సత్యనారాయణ శనివారం భాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ జోన్-2 లో రిపోర్ట్ చేయగా.. ఆయన స్థానంలో భువనగిరిరూరల్ సర్కిల్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ రిపోర్ట్ చేశారు. ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

అన్నదానం



అల్వాల్: సర్గీయ చంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు కుసుగుండ్ల మల్లారెడ్డి, పాపిరెడ్డిల ఆధ్వర్యంలో శనివారం అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సునీత, మంజుల, దేవిక, గోపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

కేలండర్ ఆవిష్కరణ



గౌతంనగర్: తెలంగాణ రాష్ట్ర గీత పనివారాల సంఘం మేడ్చల్-మల్కాజిగిరిజిల్లా ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన కేలండర్‌ను శనివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. తాటివనం, ఈతవనం పెంచేందుకు ప్రతి సొసైటీకి ఐదెకరాల భూమిని కేటాయించాలని, ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారిపడిన కార్మికుడికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు. ఆర్.వెంకటేష్‌గౌడ్, బాలయ్యగౌడ్, ఆరేపల్లి కమలాకర్, లింగం, యాదగిరి, రాములు, ప్రభాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



అల్వాల్: రాష్ట్ర విభజన హామీల అమలు కేంద్ర ప్రభుత్వ వివక్షతపై రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని టీజేఎస్ పిలుపునిచ్చింది. ఈనెల 21న మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో రాష్ట్ర సదస్సు జరుగనుందని సమాచారం. శనివారం అల్వాల్ జేఏసీ ప్రాంగణంలో సదస్సుకు సంభందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు బూరగామి ఆంజనేయులు, ఏర్పుల దయాకర్, రవికుమార్, సంగమేశ్వర్, రాజు పాల్గొన్నారు.

దశలవారీగా మౌలిక వసతులు



సెయింట్ జోసెఫ్ కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, సెయింట్ జోసెఫ్ కాలనీలో దశలవారీగా మౌలిక వసతులు కల్పించి కాలనీని అభివృద్ధి పథంలో నిలుపుతానని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. శనివారం ఆమె కాలనీని సందర్శించి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్ల నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారం అందేలా చూడాలి..

బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. శనివారం ఆమె డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశమయ్యారు. అంగన్‌వాడీ సిబ్బంది అంకితభావంతో పనిచేసినప్పుడే లక్ష్యం నేరవేరుతుందన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషిచేసి సెంటర్లను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

ఎంపీ ఎలక్షన్స్‌కు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత మందముల పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ మేరకు శనివారం చిలుకానగర్‌లో కాంగ్రెస్ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రతి నియోజవర్గానికి రూ. 10 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించనుందని దీనికి ప్రతిపాదనలను సిద్ధం చేసుకోవాలని నేతలకు సూచించారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి అడ్డా అని పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుడి వలే పనిచేసి అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. రఘుపతి రెడ్డి, ఆగంరెడ్డి, అమరేశ్వరి, లింగంపల్లి రామకృష్ణ, పల్లె రమేష్‌గౌడ్, బొట్టు రాజేష్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్-2 పలు ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ ఎం. పృథ్వీరాజ్ శనివారం ప్రకటించారు. ఈసీ కంప్యూటర్, ఫేజ్-11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, సన్‌రైస్, డైనటెక్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుషాయిగూడలో..

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్-1 పరిధిలోని చెట్లకొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ రవీందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విఠల్ తెరఫి 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, బీఎన్‌రెడ్డినగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ ఉండదని ప్రకటించారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మల్లాపూర్ బెల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఐడీఏ మల్లాపూర్, స్టాండర్డ్ టైల్స్, సాయినగర్, జోఫ్లో ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ తెలిపారు. బెల్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు తెలిపారు.

నాచారం పారిశ్రామికవాడలో..

నాచారం పారిశ్రామికవాడలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గౌతమీ పైప్స్ ఫీడర్, టైమ్స్ ఆఫ్ ఇండియా ఫీడర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నిర్వహకులు ప్రకటించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీ కృష్ణ ఫార్మా, ఏపీ ఫుడ్స్, 11 కేవీ దుర్గానగర్ ఫీడర్ పరిధిలో నాచారం ఐడీఏ రోడ్ నెంబర్ -18 వరకు విద్యుత్ సరాఫరా ఉండదని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

- జమ్మిగడ్డలో ఉద్రిక్తత
- అధికారులతో స్థానికుల వాగ్వాదం
- భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు



భారీగా మొహరించిన పోలీసు బలగాలు





199 సర్వే నెంబరులో నేలమట్టమైన అక్రమ నిర్మాణాలు

కుషాయిగూడ: ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇళ్లను అధికారులు నేలమట్టం చేశారు. బారీ బందోబస్తు మధ్య తెల్లవారు జామున అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఈ క్రమంలో బాధితులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త వాతవరణం నెలకొంది. ఈ ఘటన కాప్రా సర్కిల్ పరిధిలోని జమ్మిగడ్డ 199 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూమిలో చోటు చేసుకుంది. అధికారులంతా ఎన్నికల విధుల్లో బీజీగా ఉన్న సమయంలో 199 సర్వే నెంబరులోని ప్రభుత్వభూమిలో కొంతమంది అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఒక్కొక్కటిగా పదుల సంఖ్యలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.

◆ వారం రోజుల్లో నిర్మాణాలు పూర్తిచేసి ఏకంగా ఆ ఇళ్లలోకే మకాం మర్చారు. ఎన్నికల తర్వాత రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారుల బృందాలు అక్రమ నిర్మాణాలను పరిశీలించి వెళ్లారు. అనంతరం ఎట్టకేలకు శనివారం తెల్లవారుజామున 4 గంటలకు కాప్రా తహసీల్దార్ మతిన్ నేతృత్వంలో కూల్చివేశారు.

◆ ఈ క్రమంలో బాధితులు, అధికారులకు మధ్య వాగ్వివాదం జరిగి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. రోజు కూలీపని చేసుకుంటూ.. పైసా పైసా పోగేసుకుని నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేశారంటూ.. బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కూల్చివేతలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. స్టేడియం స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని వారు పేర్కొన్నారు.

◆ అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారితో పాటు ప్రోత్సహించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ఏసీపీలు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొనగా.. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ, జవహర్‌నగర్, కీసర పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కక్ష సాధింపు చర్యలొద్దు

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ఎన్నికలు, అభివృద్ధి వేర్వేరు అంశాలని వాటిని కలిపి రాజకీయాలు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. నేరెడ్‌మెట్ ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్ వెండర్స్ ఏర్పాటు చేసుకున్న దుకాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. అధికారుల తీరుకు నిరసనగా సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్న వ్యాపారాలు నిర్వహించడానికి ప్రభుత్వమే చిరు వ్యాపారులకు గుర్తింపుకార్డులు అందజేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రుణాలు పొంది వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ఓడిపోయామని కక్షతో వీధివ్యాపారులను నష్టపరుస్తుమంటే ఊరుకోమన్నారు. దీనికి బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ రవికిరణ్ ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ తదితరులు హాజరయ్యారు.

కార్పొరేటర్ల గైర్హాజరు..

స్థానిక ఎమ్మెల్యే అధికారులు, ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. సర్కిల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు పార్టీ కార్పొరేటర్లు ఇద్దరూ గైర్హాజరు కాగా.. ధర్నాలో వారి భర్తలు పాల్గొనడం గమనార్హం.